ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 23 ఆగస్టు 2024



పవర్‌లూమ్

- చేనేత మగ్గాలు మటాష్
- స్థానిక కార్మికులు రోడ్డుపాలు
- రూ.50 కోట్ల సబ్సిడీ స్వాహా
- నిబంధనలకు విరుద్ధంగా పవర్‌లూమ్స్ ఏర్పాటు
- వాటిపై ప్యూర్ టు ప్యూర్ రకాలు



రూ.100కోట్లతో ఏర్పాటుచేసిన చేనేత ప్లాంట్

పట్టుకేంద్రంలో బకాసురుడు

నేతన్నను మింగేస్తున్న బడానేత



పట్టు కేంద్రం ధర్మవరంలో బకాసురుడు పుట్టుకొచ్చాడు. చేనేత మగ్గాలు ఏర్పాటు చేసి, స్థానిక కార్మికులకు ఉపాధి చూపుతానంటూ కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.100 కోట్ల ప్రాజెక్టు పొందాడు. అందులో రూ.50 కోట్లు సబ్సిడీ కూడా స్వాహా చేశాడు. ఆ సొమ్ముతో ప్లాంటు ఏర్పాటు చేశాడు. కోటగోడలా ప్రహరీ కట్టాడు. నిబంధనలు తుంగల్లో తొక్కి అందులో పవర్ లూమ్స్ ఏర్పాటు చేశాడు. అవి కూడా అత్యాధునికమైనవి. సాధారణ పవర్‌లూమ్‌పై రోజుకు ఒక్క చీర తయారు చేస్తే.. కానీ, బకాసురుడు ఏర్పాటు చేసిన దానిపై రోజుకు మూడు తయారవుతాయట. ఇలా.. 200 పవర్‌లూమ్స్‌పై రోజుకు 600పైగా పట్టుచీరలు తయారు చేస్తూ.. చేనేతను కబళిస్తున్నాడు. చేనేతకు అండగా ఉండేందుకని కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.కోట్లు లబ్ధి పొంది, చివరికే వారినే మింగేస్తున్నాడు. వారి పాలిట బకాసురుడిలా తయారయ్యాడు. ఆ ప్లాంట్‌లో కూడా ఇతర రాష్ట్రానికి చెందిన కార్మికులను నియమించుకుని, స్థానిక నేతన్నలను రోడ్డున పడేస్తున్నాడు.

- ధర్మవరం

నిబంధనలకు తూట్లు

కేంద్రం ఆధీనంలో ఉండే పట్టుపరిశ్రమ శాఖ ద్వారా ఇతరులకు దక్కాల్సిన ప్రాజెక్టును తన పలుకుబడిని ఉపయోగించి సొంతం చేసుకున్నాడు బడానేత. ఇందులో 50 శాతం సబ్సిడీ అంటే రూ.50కోట్లుపోను మిగిలిన రూ.50కోట్లు మాత్రమే తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఆ శాఖ విధించిన నిబంధనలకు తూట్లు పొడుస్తూ ఆ బడా నేతన్న ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. సెరికల్చర్ నిబంధనల ప్రకారం చేనేత మగ్గాలు ఏర్పాటు చేయాలి. తద్వారా స్థానిక నేతన్నలకు ఉపాధి కల్పిస్తూ వారి కుటుంబ పోషణకు దోహదపడాల్సి ఉంటుంది. ఇక్కడ బడానేత.. చేనేత మగ్గాలను పూర్తిగా పక్కన పెట్టేసి పవర్‌లూమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పవర్‌లూమ్స్‌లో చేనేత చట్టం ప్రకారం రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేయాల్సి ఉంటుంది. ఇందులో పావడాలు, శాలువాలు, కంబళ్లు, ఆఫ్‌పట్టు, మిక్సింగ్ చీరలు తదితరాలను మాత్రమే నేయాల్సి ఉంటుంది. అందుకు విరుద్ధంగా ప్యూర్ టు ప్యూర్ తయారు చేస్తూ నేతన్నల కడుపుకొడుతున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.



అడ్డదారిలో దక్కించుకుని..

చేనేత పరిశ్రమకు చెందిన బడానేత తనకున్న రాజకీయ పలుకుబడితో మరొకరికి దక్కాల్సిన రూ.100 కోట్ల చేనేత ప్రాజెక్టును అడ్డదారిలో దక్కించుకున్నాడు. ఇందులో 10 రూ.50కోట్ల సబ్సిడీ పొందాడు. ఈ ప్రాజెక్టును బత్తలపల్లి మండలంలోని ధర్మవరం-బత్తలపల్లి రహదారికి అనుకుని ఏర్పాటు చేశాడు. సాటి చేనేత, మాస్టర్ వీవర్‌గా ఆ పరిశ్రమకు చెందిన నేతన్నలకు అండగా నిలిచి, వారికి నిత్యం పనులు కల్పించాల్సిందిపోయి వారిని రోడ్డున పడేస్తున్నాడు. నిబంధనలను తుంగలో తొక్కుతూ ఆధిపత్యం చెలాయిస్తున్నాడు. సంబంధిత అధికారులను సైతం నయానో.. భయానో తన వైపు తిప్పుకోవడం ద్వారా తన ఆగడాలను ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేసుకున్నాడు. ఇక ఆయన అక్రమాలకు అడ్డూఅదుపులేకుండా పోతోంది. ఇటీవలే రాజకీయ నాయకుడి అవతారమెత్తి తనను ప్రశ్నించే వారిని ఓ మంత్రి పేరు చెప్పుకుని బెదిరించే స్థాయికి వచ్చాడు. అధునాతన పవర్ లూమ్స్ ఏర్పాటు చేసుకుని, స్థానిక నేతన్నలను తరిమేసి ఇతర రాష్ట్రానికి చెందిన కార్మికులతో పనులు చేయిస్తున్నాడు. చేనేతను అని చెప్పుకునే ఈ బడా నేత ఏర్పాటు చేసిన పవర్‌లూమ్స్‌లో ఏకంగా రోజుకు 3 చీరలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా తాను ఏర్పాటుచేసిన 200పైగా పవర్‌లూమ్స్‌పై రోజుకు 600పైగా ప్యూర్ టు ప్యూర్ చీరలు బయటకు వస్తుండటంతో చేనేత ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీంతో చిన్నచిన్న చేనేత మగ్గాలు, ఇతర పవర్ లూమ్స్ యాజమాన్యాలు ఈ బడానేత దెబ్బకి తట్టుకోలేక విలవిల్లాడిపోతున్నారు.

అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి..

తాను చేనేత పరిశ్రమకు చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి 5 నెలలుగా ఆ బడానేత రాజకీయ నాయకుడి అవతారమెత్తినట్లు తెలుస్తోంది. ఓ మంత్రి పేరు చెప్పుకుని, బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. దీంతో పలువురు అతడంటేనే హడలిపోతున్నారు.

బాధ్యత ఏ శాఖదో?

బడా నేతన్న వ్యవహారంపై ప్రభుత్వ శాఖల అధికారులు తప్పించుకునే ధోరణి అవలంబిస్తున్నారు. పట్టు పరిశ్రమ శాఖ ఏడీ పద్మమ్మను అడగ్గా.. అది తమ పరిధి కాదనీ, చేనేత జౌళి శాఖాధికారులదే బాధ్యత అని చెప్పుకొచ్చా రు. చేనేత జౌళి శాఖాధికారి రమేశ్‌ను వివరణ కోరగా.. అది పట్టు పరిశ్రమ శాఖకు సంబంధించిందంటూ తప్పించుకున్నారు. ఇలా.. ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటుండడం శోచనీయం. రూ.50 కోట్ల సబ్సిడీ ఎవరిచ్చినట్లో ఆ దేవుడికే ఎరుక.

ఇతర రాష్ట్రం వారితో పనులు

రాష్ట్రంలోనే ఉమ్మడి అనంత జిల్లా చేనేత పరిశ్రమకు పెట్టింది పేరు. వ్యవసాయం తరువాత అత్యధికులు చేనేతే వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. బడానేత మాత్రం స్థానికంగా ఉండే నేతన్నలకు ఉపాధి కల్పించకుండా ఇతర రాష్ట్రానికి చెందిన వారిని పిలిపించుకుని, పనులు చేయించుకుంటున్నాడు. దీంతో స్థానికంగా ఉండే నేతన్నలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారు. బయటి వ్యక్తులను రానివ్వకుండా తమ ప్రాజెక్టు చుట్టూ అత్యంత ఎత్తులో ప్రహరీని కోటగోడలా నిర్మించుకున్నాడు. ఎవరైనా ఎదురుతిరిగినా, ప్రశ్నించినా బౌన్సర్లతో కౌన్సిలింగ్ నిర్వహిస్తారన్న వాదనలు చేనేత వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

యథేచ్ఛగా ప్యూర్ టు ప్యూర్ ఉత్పత్తులు

చేనేత పరిశ్రమకు చెందిన ఈ బడానేతన్న అత్యాధునిక పవర్‌లూమ్స్ ఏర్పాటుచేసి విచ్చలవిడిగా ప్యూర్ టు ప్యూర్ చీరలు తయారు చేస్తున్నాడు. చేనేతలను రోడ్డున పడేస్తున్నాడు. అందులోనూ మామూలు పవర్‌లూమ్స్‌పై రోజుకు ఒక చీర నేయగలరు. ఈ బడానేత ఏర్పాటుచేసిన పవర్‌లూమ్స్‌లో రోజుకు 3 చీరలు తయారు చేస్తున్నట్లు చేనేతవర్గాలు పేర్కొంటున్నాయి. ఇలా దాదాపు 200పైగా మగ్గాలు ఏర్పాటు చేసుకుని రోజుకు 600పైగా, నెలకు 20వేల దాకా ప్యూర్ టు ప్యూర్ పట్టుచీరలు తయారు చేస్తున్నారు. తద్వారా మిగిలిన నేతన్నలు, చిన్నచిన్న పవర్ లూమ్స్ యజమానులను దెబ్బతీస్తున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలు అమలు చేసేలా చర్యలు తీసుకోకపోతే చేనేత పరిశ్రమ తీవ్రంగా దెబ్బతినడం ఖాయం.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

- కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, ఆగస్టు 22: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, ఉచిత విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలంటూ జిల్లాకలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఉచిత ఇసుక సరఫరాపై ఎస్పీ రత్నతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇసుక వినియోగదారులు బుకింగ్, రవాణా, వ్యవస్థలను మరింత సులభతరం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సీపీ రేవు, ఉప్పలపాడు గ్రామ సచివాలయాల్లో బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. సరఫరాలో ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబరు 18004256041ను అక్కడక్కడ ప్రదర్శించాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద రద్దీని అరికట్టేందుకు బుకింగ్ వాయిస్ ఉన్న వాహనాలను మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, ఇన్‌చార్జి డీఆర్ఓ భాగ్యరేఖ, గనులశాఖ అధికారి రాంమోహనరావు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

ప్రత్యేక బృందాల ఏర్పాటు : ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 22: జిల్లాలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ రత్న స్పష్టం చేశారు. గంజాయి రవాణా నిర్మూలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎస్పీ గురువారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో మత్తుపదార్థాల రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిపై పక్కా ప్రణాళికతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాకేంద్రంలో గంజాయి అమ్ముతూ, సేవిస్తూ పట్టుబడిన కొంతమంది యువకులను అదుపులోకి తీసుకుని, తల్లిదండ్రుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. పిల్లలు గంజాయికి బానిసలు కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ సూచించారు.

విస్తృతంగా దాడులు

జిల్లా ఎస్పీ రత్న ఆదేశాల మేరకు గంజాయి రవాణా, వినియోగం, అమ్మకాలపై పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో గంజాయి స్థావరాలపై దిశ డీఎస్పీ ఆధ్వర్యంలో అర్బన్ సీఐ సునీత, స్పెషల్ పార్టీ సిబ్బంది దాడులు చేసి, కొంతమంది యువకులను పట్టుకున్నారు. యువకులకు వారి తల్లితండ్రుల సమక్షంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సునీత కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కొత్తచెరువు, ఆగస్టు 22: ధర్మవరం పట్టణంలోని కొత్తపేట రైల్వే మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామకృష్ణను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మీనాక్షి గురువారం ప్రకటనలో తెలిపారు. రామకృష్ణ ఓ కోచింగ్ సెంటర్‌లో డీఎస్సీ అభ్యర్థులకు ప్రైవేటుగా బోధిస్తున్నట్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో విచారించి, చర్యలు తీసుకున్నామన్నారు. ఉపాధ్యాయుడు రామకృష్ణపై గతంలో కూడా ఫిర్యాదులు రావడంతో అప్పట్లో కూడా శాఖాపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. అయినా.. మార్పు రాకపోవడంతో సస్పెండ్ చేశామని డీఈఓ వివరించారు.



స్పేర్ పార్ట్స్ బిగించుకుంటున్న హెచ్‌సీ రామాంజనేయులు

పోలీసు.. చేతివాటం

సీజ్ చేసిన బైక్ స్పేర్స్ చోరీ

అగళి, ఆగస్టు 22: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామాంజనేయులు.. భూతగాదా కేసులో సీజ్ చేసిన బైక్ స్పేర్‌పార్ట్స్‌ను తస్కరిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికాడు. మూడు నెలల క్రితం సీజ్‌చేసిన ఓ బైక్‌ను పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచారు. దానిని గురువారం స్థానికంగా ఉన్న ఓ మెకానిక్ షెడ్‌కు తీసుకెళ్లిన హెచ్‌సీ.. స్పేర్ పార్ట్స్ విప్పించి.. తన వాహనానికి అమర్చుకోబోయాడు. అదే సమయంలో ద్విచక్రవాహనదారు దినేష్ నేరుగా మెకానిక్ షెడ్‌కు వెళ్లి హెడ్ కానిస్టేబుల్‌ను నిలదీశాడు. దీంతో హెడ్ కానిస్టేబుల్ అక్కడి నుంచి జారుకున్నాడు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వ్యవహారంపై పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. తన బైక్ స్పేర్స్‌ను చోరీ చేయడంతోపాటు హెచ్‌సీ తనపై దాడికి వచ్చాడని, తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

అన్నం పెడితే.. ప్రాణం తీశాడు..

డబ్బుకోసమే మేకల కాపరి హత్య

- నిందితుడి అరెస్టు
- 13 మేకలు, బొలెరో వాహనం, బైక్ స్వాధీనం

హిందూపురం, ఆగస్టు 22: మహిమహిళా మేకల కాపరి పెట్టిన అన్నం తిని, ఆమెనే హత్య చేశాడు ఓ దుండగుడు. డబ్బు కోసమే మేకల కాపరి జయమ్మను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. స్థానిక అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీలు శ్రీనివాసులు, మహేష్ వెల్లడించారు. హిందూపురం మండలం మలుగూరుకు చెందిన జయమ్మ తన మేకలను మేపడానికి ఈనెల 5న గ్రామ సమీపంలోని పొలాల్లోకి తోలుకెళ్లింది. మధ్యాహ్న సమయంలో మేకల వద్దకు సోమందేపల్లి మండలం ఈదులబళాపురానికి చెందిన కంబాలప్పగారి హరి అలియాస్ కథల హరి వెళ్లాడు. జయమ్మ వద్ద కూర్చుని, మాటలు కలిపాడు. ఆమె పెట్టిన అన్నం తిన్నాడు. మేకలు దూరంగా వెళ్తుండగా అక్కడికి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న జయమ్మను టవల్‌తో గొంతు బిగించాడు. ఆమె కింద పడిపోవడంతో చేతులు కట్టేసి, చనిపోయిందని నిర్ధారించుకున్నాడు. మేకలను కొంతదూరం తోలుకెళ్లి పరిగి మండలం గొల్లపల్లికి చెందిన బొలెరో వాహన డ్రైవర్‌కు ఫోన్‌చేసి రప్పించుకున్నాడు. మేకలను అందులో ఎక్కించుకుని, తీసుకెళ్లాడు. రాత్రయినా జయమ్మ ఇంటికి రాకపోవడం, మేకలే రావడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల గ్రామాలు, పొలాల్లో గాలించారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు 48గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేశారు. బొలెరో వాహనం, 13 మేకలు, బైక్, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీలు తెలిపారు. సమావేశంలో సీఐలు ఆంజనేయులు, రాజగోపాల్ నాయుడు, జనార్ధన్, అబ్దుల్ కరీం, చిలమత్తూరు ఎస్ఐ మునీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

15రోజుల క్రితం మరోచోట రెక్కీ..

నిందితుడు కంబాలప్పగారి హరి 15 రోజుల క్రితం హిందూపురం మండలం రాచపల్లి వద్ద రెక్కీ నిర్వహించాడు. అక్కడ ఒంటరిగా గొర్రెలను మేపుతున్న మహిళను చూశాడు. అదేరోజు మేకలు తరలించడానికి ప్రయత్నించాడు. సమీపంలో వేరే వ్యక్తులు ఉండటంతో వీలుకాలేదు. ఈ నేపథ్యంలో 5వ తేదీన మలుగూరు వద్ద ఒంటరిగా కనిపించిన జయమ్మను హత్యచేసి, మేకలు అపహరించాడు.



నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీలు, సీఐలు

మడకశిరకు మంచి రోజులు..


రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు

- డీపీఆర్ తయారీకి రూ.28 లక్షలు మంజూరు
- హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులకు ఉత్తర్వులు

మడకశిర, ఆగస్టు 22: నియోజకవర్గానికి మళ్లీ మంచిరోజులు వస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ఇక్కడి ప్రజల దశాబ్దాల కలలు నెరవేరుతున్నాయి. వేల అడుగులు బోర్లు తవ్వినా తేమ కూడా కనిపించని ఈ ప్రాంతంలో నదీ జలాలు గలగలా పారనున్నాయి. ఈనెల 1వ తేదీన గుండుమల గ్రామంలో పర్యటించిన సందర్భంగా నియోజకవర్గంలో రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. 20 రోజులు తిరక్కుండానే ఆ హామీ అమలుకు ఉపక్రమించారు. రిజర్వాయర్ల నిర్మాణానికి సర్వే చేసి, డీపీఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) పంపాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి హంద్రీనీవా అధికారులకు ఉత్తర్వులు వచ్చాయి. ఈ విషయాన్ని హంద్రీనీవా ఈఈ రాజాస్వరూప్ కుమార్ గురువారం తెలిపారు. డీపీఆర్ తయారీకి రూ.28 లక్షలు మంజూరైందన్నారు. సర్వే చేసి నివేదిక తయారు చేయడానికి నెల సమయం పడుతుందని ఆయన చెప్పారు. త్వరలోనే సర్వే పనులు ప్రారంభమౌతాయన్నారు.

మాట ఇచ్చారు.. అమలు చేశారు..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల ఒకటో తేదీన మడకశిర మండలం గుండుమల గ్రామంలో పర్యటించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా నియోజకవర్గంలో భూగర్భజలాలు అడుగంటాయని, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గుడిబండ మండలం రాళ్లపల్లి వద్ద, రొళ్ల మండలం రత్నగిరి వద్ద రిజర్వాయర్లు నిర్మించాలని వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి అందుకు అంగీకరించారు. రిజర్వాయర్లు నిర్మిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఆ మేరకు వెంటనే చర్యలు చేపట్టారు. ఇచ్చిన మాట ప్రకారం రిజర్వాయర్ల ఏర్పాటు దిశగా తొలి అడుగు వేశారు. 20 రోజులకే డీపీఆర్ తయారీకి ఏకంగా నిధులు మంజూరు చేశారు. దీంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ల నిర్మాణం పూర్తయితే నియోజకవర్గం రూపురేఖలు మారిపోతాయని సంబరపడిపోతున్నారు.



ఓబులమ్మకు పక్కా ఇల్లు

మడకశిర రూరల్: సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గుండుమల గ్రామానికి చెందిన ఓబులమ్మకు పక్కా ఇల్లు మంజూరైంది. ఈనెల 1న గుండుమల గ్రామంలో ఓబులమ్మ, రామప్పకు సీఎం చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేశారు. ఆ సమయంలో తనకు సొంత ఇల్లులేదని ఓబులమ్మ.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. మాట నిలబెట్టుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు గుండుమల గ్రామానికి గురువారం వెళ్లి ఓబులమ్మకు పక్కా ఇంటి మంజూరు పత్రాన్ని అందజేశారు. అనంతరం గృహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఓబులమ్మ ఇంటి నిర్మాణం కోసం రూ.3.50 లక్షలు మంజూరైందని ఎమ్మెల్యే తెలిపారు. మొదటి విడతగా రూ.50 వేలు ఇస్తామన్నారు.



ఓబులమ్మకు ఇంటి మంజూరుపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

వట్టిపోతున్న పీబీసీ!

మూలనపడిన ఎత్తిపోతల పథకం

బీడుగా ఆయకట్టు.. తాగునీటికీ కటకట




పనికిరాకుండా పోతున్న ఎత్తిపోతల పథకం



పీబీసీలో అడ్డువేసిన దృశ్యం

తాడిమర్రి: పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) వట్టిపోతోంది. కాలువలో నీరు పారడమే గగనమైంది. దీంతో ఆయకట్టు బీడుగా మారింది. కాలువ నీటిపై ఆధారపడిన గ్రామాల్లో కనీసం తాగడానికి నీరు కూడా దొరకని దుస్థితి నెలకొంది. మండలంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ద్వారా నీరందించాలని గతంలో నిర్ణయించారు. ఆ మేరకు నార్పల మండలం తుంపెర వద్ద డీప్ కట్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి పులివెందుల బ్రాంచ్ కెనాల్ తవ్వారు. ముచ్చుకుంటపల్లి, రామాపురం, గంగనపల్లి, కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల, గుడ్డంపల్లి గ్రామాల మీదుగా చిత్రావతి నదిలోకి నీరు మళ్లించారు. ఈ కాలువ ద్వారా 1991 నుంచి ఏటా చిత్రావతి నదికి నీరు వదులుతూ వచ్చారు.



అప్పట్లో బియ్యం అమ్మేవాళ్లం... ఇప్పుడు కొంటున్నాం..

పీబీసీకి నీరు బాగా వచ్చినపుడు ఐదెకరాల్లో వరి సాగుచేశా. ప్రస్తుతం నీరు రాక పంట పెట్ట డమే మానేశా. నేనే బియ్యం కొంటున్నా. కూటమి ప్రభుత్వమైనా రైతుల పక్షాన ఆలోచించి, పీబీసీకి నీరు వదలాలి.

-శ్రీనివాసరెడ్డి, రైతు, కునుకుంట్ల



ఎత్తిపోతల పథకం నిర్వీర్యం

గ్రామం పక్కనే పులివెందుల బ్రాంచ్ కెనాల్ వెళ్తోంది. కాలువకు నీరు వదలకపోవడంతో 6 నెలలుగా గ్రామంలో ఎద్దడి తలెత్తింది. ట్యాంకర్లతో నీటిని తెచ్చుకుంటున్నాం. కూటమి ప్రభు త్వం.. కాలువకు నీరిచ్చి, ఆదుకోవాలి.

- తమ్మినేని రామ్మోహన్, మాజీ సర్పంచ్, రామాపురం

గండికొట్టిన గండికోట

కడప జిల్లాలోని గండికోట ప్రాజెక్టు నుంచి లిఫ్ట్ సిస్టం ద్వారా సీబీఆర్‌కు పదేళ్ల క్రితం నీటి పంపింగ్ మొదలెట్టారు. అప్పట్నుంచి పీబీసీ ద్వారా నీటిని వదలడం తగ్గిస్తూ వచ్చారు. గత టీడీపీ హయాంలో కొంతమేర నీరు వదిలారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక ఒకట్రెండు రోజులు కూడా కాలువకు నీరు వదల్లేదు. దీంతో కాలువ నీటిపై ఆధారపడిన గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తుతోంది. భూగర్భ జలమట్టం తగ్గిపోయి. రైతులు పంటలకు దూరమవుతున్నారు. మండలంలో ఒకప్పుడు 400 ఎకరాల్లో సాగైన వరి పంట నేడు 50 ఎకరాల్లో కూడా వేయట్లేదు. ప్రస్తుతం కొలువు దీరిన కూటమి ప్రభుత్వం తుంపర డీప్ కట్ నుంచి పీబీసీకి నీరు వదిలి, తమను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు. నీరు వదలకుంటే రామాపురం గ్రామం వద్ద ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకం కూడా నిర్వీర్యమైపోతుందని వాపోతున్నారు.

ఉచిత ఇసుక సరఫరాను సమర్థవంతంగా అమలు చేయాలి

ఫిర్యాదుల స్వీకరణకు టోల్‌ఫ్రీ నంబర్: 08554-298380

కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, ఆగస్టు 22: జిల్లాలో ఉచిత ఇసుక సరఫరా ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సీఎస్ నీరబ్ కుమార్ జారీచేసినఉత్తర్వుల మేరకు గురువారం జిల్లా అధికారులకు ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్నిమండలాల ప్రత్యేక అధికారులు ఇసుక రీచ్‌లను, స్టాక్ పాయింట్లను స్వయంగా వెళ్లి పరిశీలించాలన్నారు. ఇసుక సరఫరా సక్రమంగా అమలయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తాడిపత్రి మండలంలో గుర్తించిన 620 మెట్రిక్ టన్నుల ఇసుక అక్రమ నిల్వలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెంటనే నివేదికలు పంపాలని డీఎంజీఓను ఆదేశించారు. ఇసుక బుకింగ్ కోసం రాయదుర్గం తహశీల్దార్ కార్యాలయంలో ఒక అధికారికి బాధ్యతలు అప్పగించి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్ల వద్ద ట్రక్కులలోకి లోడ్‌చేయబోయే తేదీ, సమయం తప్పనిసరిగా పేర్కొంటూ రశీదులను జారీచేయాలన్నారు. ఇసుకరవాణా చేసే వాహనాలను కమిషనర్ అండ్ మైన్స్ జియాలజీ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉచిత ఇసుకకు సంబంధించిన కార్యకలాపాలకు ఇన్‌చార్జిగా తహసీల్దార్ ఉండాలన్నారు. ఇసుకరవాణాకు సంబంధించి రవాణాదారులు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడినా సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్ల వద్ద అనవసరంగా ఒక్క వాహనం కూడా ఉండకూడదని హెచ్చరించారు. ఇసుక కార్యకలాపాలకు ఆటంకాలు కలగకుండా స్టాక్ పాయింట్లకు సమీపంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 22: ఉమ్మడి అనంత జిల్లాల్లోని గిరిజన అభ్యర్థులకు నిర్వహించనున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు సంబంధించిన దరఖాస్తుల గడువు ఈ నెల 31 వరకు పొడిగించినట్లు సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ అభ్యర్థులు డిగ్రీ, బీఈడీ, ఈఈడీ, టెట్ పరీక్ష, వయస్సు, మెరిట్ ఆధారంగా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అనంతపురంలోని పెన్నార్‌భవన్‌లో ఉన్న గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

25 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 22: జిల్లాలోని 25 మండలాల్లో బుధవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా బొమ్మనహాళ్‌లో 29.0 మి.మీల వర్షపాతం నమోదైంది. విడపనకల్లు 25.2, వజ్రకరూరు 23.2, రాప్తాడు 20.4, డీ. హిరేహాళ్ 18.0, పామిడి 15.2, బెళుగుప్ప 14.6, గుంతకల్లు 13.4, కూడేరు 11.4, కణేకల్లు 11.2, గుత్తి 8.8, గార్లదిన్నె 7.2, ఉరవకొండ 6.8, పెద్దపప్పూరు, ఆత్మకూరు 5.2, అనంతపురం 5.0 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 4.6 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

ఆహారశుద్ధి పరిశ్రమలకు ప్రోత్సాహం

జిల్లా ఉద్యాన శాఖాధికారి నరసింహారావు

అనంతపురం అర్బన్, ఆగస్టు 22: అనంతపురం ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆహారశుద్ధికి సంబంధించి కుటీర పరిశ్రమల ఏర్పాటు కోసం రాయితీ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు తెలిపారు. గురువారం స్థానిక ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జోనల్ మేనేజర్ అలెన్ మ్యాథ్యూతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి ఆహారశుద్ధి క్రమబద్ధీకరణ ద్వారా 18 సంవత్సరాలు నిండిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, స్వయంసహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాకు ఈ ఏడాది 310 టార్గెట్ ఇచ్చారన్నారు. ప్రాజెక్టు విలువలో లబ్ధిదారులు 10 శాతం భరిస్తే, 35 శాతం ప్రభుత్వం రాయితీ వర్తింపజేస్తుందన్నారు.

పనుల వివరాలు నమోదు చేయించాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, ఆగస్టు 22: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నిర్వహించే గ్రామసభల్లో ఆయా గ్రామాల్లో జరగాల్సిన అభివృద్ధి పనులు నమోదు చేయించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో గ్రామ అభివృద్ధి పనులు గుర్తించేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున గ్రామ సభలు నిర్వహిస్తోందన్నారు. ఈ సభలకు పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, గ్రామ ముఖ్యనాయకులు హాజరై ఆయా ప్రాంతాల్లో చేయాల్సిన పనులను నమోదు చేయించాలన్నారు.

అదనపు సీట్ల కేటాయింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 22: అంబేడ్కర్ గురుకులాల్లో అదనపు సీట్లు కేటాయించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో సీట్ల కోసం విద్యార్థుల అవస్థలపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 9న సీటెలా గురూ కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ కథనానికి అంబేడ్కర్ గురుకులాల రాష్ట్ర సెక్రటరీ స్పందించారు. 5 నుంచి 8వ తరగతులకు 183 అదనపు సీట్లను కేటాయించారు. సెక్షన్‌కు 5 చొప్పున 90 సీట్లు మించకుండా 183 సీట్లకు ఆమోదం తెలిపినట్లు జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. 5వతరగతి అదనపు సీట్లను బ్రాగ్ సెట్‌లోని మెరిట్ విద్యార్థులతో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. 6 నుంచి 8వ తరగతుల అదనపు సీట్లను ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

జేఎన్‌టీయూకు ఐఎస్ఓ గుర్తింపు

వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు



ఐఎస్ఓ సర్టిఫికెట్స్‌ను అందుకుంటున్న వీసీ, రిజిస్ట్రార్

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 22: నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యకు జేఎన్‌టీయూ మారుపేరని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూకి మూడవసారి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్స్ (ఐఎస్ఓ) గుర్తింపు లభించింది. గురువారం జేఎన్‌టీయూని సందర్శించిన ఐఎస్ఓ ప్రతినిధులు అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ.. ఉన్నతవిద్యలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన వసతులు కల్పిస్తున్నామని దీంతో అంతర్జాతీయస్థాయి గుర్తింపును పొందుతున్నామన్నారు. ఇదే ఒరవడిని భవిష్యత్తులో పాటిస్తూ మరింత అభివృద్ధికి అందరూ సమష్టి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఐఎస్ఓ ప్రతినిధి శివయ్య వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్యకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ టు వీసీ దేవన్న, డైరెక్టర్లు దుర్గాప్రసాద్, సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ఎంబీఏ విభాగాధిపతి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.20

అనంతపురంరూరల్, ఆగస్టు 22: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 3750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. అలాగే కిలో సరాసరి ధర రూ.11, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

నామినేటెడ్ ఎదురుచూపులు

ఊరిస్తున్న పదవులు

పదుల సంఖ్యలో ఆశావహులు... పూర్తయిన కసరత్తు

ఒక్కో నియోజకవర్గానికి నలుగురి పేర్ల పరిశీలన

తొలివిడతలో ముగ్గురికే చోటు

రెండుమూడ్రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం



అనంతపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలకుపైగా కావస్తోంది. దాదాపు నెల రోజులుగా నామినేటెడ్ పదవుల పంపకాలపై కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ అధినాయకత్వాలు కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే జిల్లాలో ఆయా పార్టీల తరఫున ఎవరికి నామినేటెడ్ పదవులివ్వాలి..? ఎవరు అర్హులు..? పార్టీకి కష్టపడిన నాయకులెవరు..? మరీ ముఖ్యంగా వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన నాయకులెవరు..? అక్రమ కేసులతో ఇబ్బందిపడిన నేతలెవరు..? ఇలా అనేక వివరాలను పరిగణలోకి తీసుకొని నామినేటెడ్ పదవులివ్వాలన్నది ఆయా పార్టీలు అంచనాకు వచ్చాయి. కూటమిలోని బీజేపీ, జనసేన పార్టీల్లో చురుగ్గా పనిచేసే నాయకులను వేళ్లమీద లెక్కపెట్టే పరిస్థితి ఉంది. తెలుగుదేశం పార్టీలో ఆ పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గం నుంచి 20 మంది పేర్లను ఆ పార్టీ అధిష్ఠానం పరిగణలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్‌ఆయా నియోజకవర్గాల స్థానిక ఎమ్మెల్యేలతోపాటు జిల్లా అధ్యక్షులకు బాధ్యతలు అప్పగించారు. అంతటితో ఆగని ఆ పార్టీ అధినాయకత్వం పార్టీ ప్రత్యేకంగా నియమించుకున్న నిఘా వర్గాల ద్వారానూ నామినేటెడ్ పదవులు ఎవరికి ఇవ్వాలనే జాబితాను సేకరించింది. కాగా ఇప్పటికే ఆ పార్టీ అధిష్ఠానానికి అటు ఎమ్మెల్యేలు, ఇటు పార్టీ పార్లమెంటు అధ్యక్షులు, మరోవైపు నిఘా వర్గాల ద్వారా సేకరించిన జాబితాను వడపోసినట్లు సమాచారం. వడపోతలో భాగంగా ఒక్కో నియోజకవర్గం నుంచి నలుగురి పేర్లు పరిశీలనలోకి తీసుకున్నట్లు టీడీపీ అధిష్ఠానం ముఖ్య వర్గాల ద్వారా అందిన సమాచారం. ఆ నలుగురి పేర్లలోనూ ఎవరు పార్టీకి విధేయులుగా పనిచేశారు..? ఎవరు వైసీపీ పాలనలో ఇబ్బందులకు గురయ్యారు..? కేసులతో నలిగిపోయారు..? ఆ వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి ఆ నలుగురిలోనూ ఒకరిద్దరికి మాత్రమే ఏదో రూపంలో నామినేటెడ్ పదవులతో సంతృప్తిపరచాలనే యోచనలో టీడీపీ అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా... నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నవారు టీడీపీలో అత్యధికులున్నారు. అందులోనూ పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్నవారూ లేకపోలేదు. తనకు నామినేటెడ్ పదవి దక్కుతుందనే ఆశల్లో ఎవరికి వారున్నారు. అదిగో... ఇదిగో నామినేటెడ్ పదవుల ప్రకటన వెలువడుతుందని నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న ఆశావాహులు ఎదురుచూస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆషాడమాసం పూర్తయిన వెంటనే నామినేటెడ్ పదవుల జాబితా విడుదల చేస్తారని ఆశావాహులు ఆశించారు. శ్రావణమాసంలో పక్షంరోజులు గడుస్తున్నా ఇప్పటికీ నామినేటెడ్ పదవుల ఆశావాహులకు ఎదురుచూపులే మిగిలాయి. కాగా సోషల్‌మీడియాలో నామినేటెడ్ రాష్ట్రస్థాయి పదవుల జాబితా చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో జిల్లాలో ఎవరైతే నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారో ఆ ఆశావాహుల పేర్లు ఆ జాబితాలో లేకపోవడంతో ఒకింత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్న పరిస్థితులు ఆ పార్టీలో లేకపోలేదు. కొందరైతే ఫేక్ అంటూ కొట్టిపారేస్తూనే లోలోన మాత్రం మదనపడుతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏదేమైనప్పటికీ జిల్లాకు మాత్రం రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు తప్పకుండా లభిస్తాయనే ఆశాభావంలో ఆశావాహులుండటం గమనార్హం.

తొలివిడతలో ముగ్గురికే చోటు...

కూటమి ప్రభుత్వం మరో రెండుమూడ్రోజుల్లో నామినేటెడ్ పదవుల పందేరానికి రంగం సిద్ధం చేసినట్లు ఆయా పార్టీల ముఖ్యనేతల ద్వారా అందిన సమాచారం. మొదటి విడతలో రాష్ట్రస్థాయి అందులోనూ కేబినేట్ హోదా పదవుల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. తొలివిడత నామినేటెడ్ పదవుల్లో జిల్లాలో ముగ్గురికి చోటు కల్పించే అవకాశాలు మెండుగా ఉన్నాయని సమాచారం. టీడీపీ అధిష్టానం ముఖ్య వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు ఓసీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ముగ్గురు నేతలకు నామినేటెడ్ పదవులు దక్కనున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ నామినేటెడ్ పదవులు ఎవరికి దక్కనున్నాయో ఇప్పటివరకూ పేర్లు బయటకు పొక్కకుండా గోప్యంగా ఆ పార్టీ అధిష్టానం వ్యవహరిస్తోంది. జనసేన, బీజేపీల నుంచి ఎవరికి నామినేటెడ్ పదవులు దక్కనున్నాయో బయటకు పొక్కకపోవడం గమనార్హం.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, ఆగస్టు 22: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలు డిసెంబరు 8న జరుగుతాయని, వచ్చే నెల 9వ తేదీలోగా పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయడానికి ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ ఈనెల 5వ తేదీ నుంచి అందుబాటులో ఉందన్నారు. విద్యార్థులు తమ ఆధార్‌కార్డులో ఉన్న విధంగానే పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఎంపీపీ పాఠశాలలు, వసతి లేని ఏపీ మోడల్ స్కూళ్లలో 8వ తరగతి చదువుతూ రూ.3.50 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 50 పరీక్ష ఫీజుగా ఎస్‌బీఐ కలెక్షన్ లింకు ద్వారా మాత్రమే చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు కమలానగర్‌లో ఉన్న డీఈఓ ఆఫీస్‌లోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయ అధికారి ఇంట్లో చోరీ

37 తులాల బంగారు నగలు, రూ. 50 వేల నగదు అపహరణ



చోరీ వివరాలు తెలుసుకుంటున్న సీఐ సురేష్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 22: జిల్లా కేంద్రానికి కూతవేటుదూరంలో ఉన్న సందీప్‌విల్లాస్‌లోని ఓ విల్లాలో నివాసముంటున్న మండల వ్యవసాయ అధికారి వెంకటబ్రహ్మం ఇంటిలో చోరీ జరిగింది. బుధవారం అర్ధరాత్రి వ్యవసాయ అధికారి చెందిన విల్లానెంబరు 40లో ఇంటి కిటికీలు తొలగించి లోనికి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న 37 తులాల బంగారంతోపాటు రూ. 50 వేల నగదును దొంగలించారు. విధుల్లో భాగంగా వ్యవసాయ అధికారి బయటకు వెళ్లి అర్ధరాత్రి తర్వాత ఇంటికి వచ్చారు. ఇంటిని పరిశీలించగానే చోరీ జరిగినట్లు గుర్తించారు. కాగా ఆతడి భార్య పై అంతస్తులో నిద్రిస్తోంది. వ్యవసాయ అధికారి ఫిర్యాదు మేరకు పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్, ఎస్ఐ క్రిష్ణమూర్తి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



వన్నూరుస్వామి (ఫైల్)

కళ్యాణదుర్గం(కంబదూరు), ఆగస్టు 22: కంబదూరు మండల పరిధిలోని అండేపల్లికి చెందిన రైతు వన్నూరుస్వామి(48) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. వన్నూరుస్వామి తనకున్న రెండు ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశాడు. బుధవారం ఉదయమే పంటకు మందును పిచికారి చేసేందుకు వెళ్లాడు. పంటకు మందును పిచికారి చేసిన తర్వాత వ్యవసాయ మోటర్ ఆఫ్ కావడంతో తోట పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. అక్కడ కింద పడి ఉన్న విద్యుత్ తీగను సరిచేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యాదాఘాతానికి గురై మృతి చెందాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో భార్య చిట్టెమ్మకు అనుమానం వచ్చి తోటలోకి బంధువులతో కలిసి వెళ్లింది. భర్త విగతజీవిగా పడి ఉండడం చూసి భార్య, బంధువులు బోరున విలపించారు. గురువారం కంబదూరు పోలీసులకు భార్య చిట్టెమ్మ ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ ఎప్పుడో..?

వారం రోజుల క్రితం సబ్సిడీ ఖరారు

పూర్తి ధరలు ఖరారు చేయని ఉన్నతాధికారులు

ప్రత్యామ్నాయ విత్తనాల కేటాయింపుతో సరిపెట్టిన వైనం

విత్తనాల సరఫరా కోసం ఆన్‌లైన్ టెండర్ల నిర్వహణ

వర్షాలతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు సన్నద్ధం



అనంతపురం అర్బన్ ఆగస్టు 22: జిల్లావ్యాప్తంగా కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో వేరుశనగ, ఇతర రకాల పంటలు సాగు చేయలేని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే జిల్లా రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆశించిన స్థాయిలో పంటలు సాగు కాలేదు. ఈ నేపథ్యంలో జిల్లాకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయ యంత్రాంగం రాష్ట్ర కమిషనరేట్‌కు ఇదివరకే ప్రతిపాదనలు పంపింది. ఎట్టకేలకు గత వారం రోజుల క్రితం జిల్లాకు ప్రత్యామ్నాయ విత్తనాలు కేటాయించడంతోపాటు ప్రత్యామ్నాయ విత్తనాల సబ్సిడీ ధర ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇప్పటి దాకా విత్తనాల పూర్తి ధరలు ఖరారు చేయలేదు. ప్రత్యామ్నాయ విత్తనాలు సరఫరా కోసం ఏపీసీడ్స్ రాష్ట్ర ఉన్నతాధికారులు బుధవారం ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించడంతోపాటు ఆన్‌లైన్ టెండర్లల్లో ఓపెన్ చేసి, ఎవరెవరు ఏయే ధరలకు టెండర్ దాఖలు చేశారన్న వివరాలు నమోదు చేసినట్లు సమాచారం. శుక్రవారం ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేసిన టెండర్‌దారులతో ఫైనల్ ధరల ఖరారుపై చర్చించేందుకు విజయవాడకు రావాలని పిలిచినట్లు సమాచారం. టెండర్లు ఖరారైన తర్వాత ఎప్పటిలోగా జిల్లాకు ప్రత్యామ్నాయ విత్తనాలు సరఫరా చేస్తారు..? ఏయే తేదీల్లో విత్తన పంపిణీ ఉంటుందన్న వివరాలు తెలిసే అవకాశం ఉంది. కొన్ని రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పొలాల్లో పదును ఆరగానే విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాల కోసం సన్న,చిన్నకారు రైతులు నిరీక్షిస్తున్నారు. మరికొందరు సబ్సిడీ విత్తనాలు ఇవ్వడం ఆలస్యమైతే ఇబ్బందులు ఎదురవుతాయన్న ఆలోచనతో బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో ప్రధాన పంటల సాగు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపిన సమయంలోనే టెండర్ల నిర్వహణపై దృష్టి సారించి ఉంటే ఈ పాటికి రైతుల చేతుల్లో విత్తనాలు ఉండేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీడుగా 2.03 లక్షల హెక్టార్లు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3.46 లక్షల హెక్టార్లు. ఇందులో వేరుశనగ 1.97 లక్షల హెక్టార్లుగా అంచనా వేశారు. ఇప్పటి దాకా 1.43 లక్షల హెక్టార్లల్లోనే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 53వేల హెక్టార్లు, కంది 40వేలు, పత్తి 21వేలు, ఆముదం 12వేలు, మొక్కజొన్న 7580, సజ్జ 2149, కొర్ర 2645 హెక్టార్లల్లో సాగయ్యాయి. మిగతా విస్తీర్ణంలో జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్, పెసలు, మినుములు తదితర పంటలు సాగయ్యాయి. కాగా జిల్లావ్యాప్తంగా ఇంకా 2.03 లక్షల హెక్టార్లల్లో పొలాలు బీడుగా మిగిలిపోయాయి.

ప్రత్యామ్నాయ విత్తనాల కేటాయింపుతో సరి..

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేరుశనగ, కంది, ఇతర రకాల పంటలు ఆశించిన స్థాయిలో సాగు కాలేదు. ఇదివరకే వేరుశనగ, ఇతర ప్రధాన పంటల సాగుకు అదును సమయం దాటిపోయింది. ఈ నేపథ్యంలో జిల్లాకు 27907 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు కేటాయించారు. ఇందులో ఉలవలు 21791 క్వింటాళ్లు, పెసలు 1501, అలసంద 3253, జొన్న 973, కొర్ర 369, మినుమలు 20 క్వింటాళ్లను కేటాయించారు. వారం రోజుల క్రితం ప్రత్యామ్నాయ పంటలవిత్తనాలు కేటాయించడంతోపాటు 80 శాతం సబ్సిడీ ఖరారు చేయడంతో సరిపెట్టారు.

అలసంద సాగు చేస్తా



ఖరీఫ్‌లో వర్షాలు సరిగా పడకపోవడంతో వేరుశనగ పంట సాగు చేయలేకపోయా. కొన్ని రోజులుగా పదును వాన పడుతోంది. పదును ఆరిన తర్వాత ఐదెకరాల్లో అలసంద పంట సాగు చేస్తా. అంతలోగా వ్యవసాయ శాఖ అధికారులు సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తే ఉపయోగంగా ఉంటుంది. పంపిణీ ఆలస్యమైతే బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసి పంట సాగు చేయాలనుకుంటున్నా.

\- బండి భరత్, కొర్రకోడు, కూడేరు

మార్కెట్‌లో జొన్న విత్తనాలు కొనుగోలు చేశా



ఎనిమిదెకరాల పొలంలో జొన్న సాగు చేసేందుకు సిద్ధం చేసుకున్నా. ఎకరాకు 3 కేజీల జొన్న విత్తనాలు అవసరం. కొన్నిరోజులుగా వానలు బాగా పడుతున్నాయి. సబ్సిడీ విత్తనం ఎప్పుడు ఇస్తారో ఏమో తెలియడం లేదు. అందుకే కేజీ రూ.80లతో బయట మార్కెట్‌లో జొన్న విత్తనాలు కొనుగోలు చేశా. పదును ఆరగానే జొన్న విత్తేస్తా.

\- సూర్యనారాయణ, పిన్నేపల్లి, యాడికి మండలం

ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించారు

ఏపీసీడ్స్ రాష్ట్ర ఉన్నతాధికారులు బుధవారం ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరా కోసం ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించడంతోపాటు టెండర్లు ఓపెన్ చేశారు. టెండర్లు ఖరారు చేసేందుకు ఆన్‌లైన్‌లో టెండర్ దాఖలు చేసిన టెండర్‌దారులను శుక్రవారం విజయవాడకు రావాలని ఉన్నతాధికారులు తెలియజేశారు. టెండర్లు ఖరారుకాగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విత్తన సరఫరాదారుల నుంచి జిల్లాకు ప్రత్యామ్నాయ విత్తనాలు తెప్పించి, వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో రైతులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం.

\- సుబ్బయ్య, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్

సోలార్‌తో వినియోగదారుడికి ఆదాయం

విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ

హిందూపురం అర్బన్, ఆగస్టు 22: సోలార్ ప్యానల్ వాడకంతో వినియోగదారుడికి ఆదాయం సమకూరుతుందని విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ అన్నారు. సోలార్ ప్యానల్ వేసుకున్న వారు అవసరం మేకు విద్యుత్ వినియోగించుకొని మిగిలిన దానిని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. స్థానిక వాసవీ ధర్మశాలలో గురువారం డివిజన్‌స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కేవలం రూ. 63 కోట్లు బిల్లులు వసూలు అయ్యేదని ఇప్పుడు అది రూ. 135 కోట్లకు పెరిగిందన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించే దిశలో అధికారులు, సిబ్బంది నిరంతర సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా సోలార్ ప్యానల్‌లను ఏర్పాటు చేసి ఖర్చులను తగ్గించుకునే ప్రణాళిక తీసుకొచ్చారన్నారు. దీని ద్వారా వినియోగదారుడికి విద్యుత్ ఖర్చు తగ్గుతుందన్నారు. హిందూపురం డివిజన్‌లో లక్ష్య సోలార్ ప్యానల్‌లు అతిత్వరలో ఏర్పాటు చేసే దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ భూపతి, ఎస్ఏఓ బాలాజీ వెంకటేష్, సన్‌మిత్ర అధినేత ఓబుళేష్, 1104 యూనియన్ డివిజన్ కార్యదర్శి డీఎల్ శ్రీనివాసులు, ఇతర జేఏసీ నాయకులు, ఏడీఈలు, ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి వెళితే ప్రాణాలు పోయాయి..!

పై అంతస్తు నుంచి దూకిన దొంగ

అక్కడికక్కడే మృతి



అనంతపురం క్రైం, ఆగస్టు 22: దొంగతనానికి వెళ్లిన ఓ దొంగ చావు కొనితెచ్చుకున్నాడు. ఓ అపార్ట్‌మెంట్‌లో దొంగతనానికి వెళ్లి అక్కడి వారు గుర్తించడంతో పై అంతస్తు కెళ్లి భయంతో దూకేశాడు. దీంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బుక్కరాయసముద్రం మండలం చెదళ్లకు చెందిన కురుబ యల్లప్ప (28) అవివాహితుడు. గుజిరీ సామాన్లు దొంగతనం చేసేవాడు. గురువారం తెల్లవారుజామున రిలయన్స్ మార్ట్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి దొంగతనానికి వెళ్లాడు. అందులోని ఓ ఫ్లాట్‌లో దొంగతనానికి ప్రయత్నిస్తుండగా కిందఫ్లోర్‌లో ఉండే కియా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు ఇద్దరు అప్రమత్తమయ్యారు. ఏదో శబ్దం వస్తోందని వారు పైకి వెళ్లి చూశారు. వారిని గమనించిన దొంగ పైఅంతస్తుకెళ్లాడు. వారు అలాగే వెంబడించడంతో దిక్కుతోచని దొంగ భయంతో పైఅంతస్తు నుంచి కిందకు దూకేశాడు. కాళ్లు, తొడ భాగంలో తీవ్ర రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య



సునీత మృతదేహం

గుత్తిరూరల్, ఆగస్టు 22: మండలంలోని తురకపల్లి గ్రామంలో గురువారం వివాహిత సునీత (34) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి భార్య సునీత గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడివుంది. బంధువులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చీనీ కాయలు టన్ను రూ.23 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 22: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 162 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నేడు గ్రామసభలు

పుట్టపర్తి, ఆగస్టు 22 : రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నిర్వహించే గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు గ్రామసభల్లో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన వినతులను పారదర్శకంగా పరిష్కరించాలన్నారు.

సద్వినియోగం చేసుకోండి : రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నిర్వహించే గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గ్రామసభల్లో కూటమి నాయకులు పాల్గొనాలని, ప్రజాఫిర్యాదుల పరిష్కరించడానికే ప్రభుత్వం ఈ గ్రామసభలు నిర్వహిస్తోందని అన్నారు.

నంబులపూలకుంట: ఉపాధి పథకంలో కొత్త పనుల ఎంపిక, ఆమోదం కోసం శుక్రవారం మండలంలోని 14 పంచాయతీల్లో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మనోహర్‌బాబు తెలిపారు. ఈ గ్రామసభలో నూతన పనులు, ప్రణాళికలు తయారు చేస్తామన్నారు. ఈ సభలకు సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది, కూలీలు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

కదిరి, (అమడగూరు) : మండలంలోని పది పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి పథకంలో కొత్త పనులు గుర్తించడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మునియప్ప తెలిపారు. ఈ సభలకు సచివాలయ, ఉపాధి సిబ్బంది, వెలుగు కార్యాలయం, కూలీలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని 13 పంచాయతీ కేంద్రాల్లో ఉపాధి పనులు గుర్తించడానికి శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. ఈగ్రామసభల్లో ఆయా గ్రామాల పరిధిలో కొత్త పనుల ఎంపిక చేస్తారన్నారు.

ప్రకృతి పాఠశాల ఏర్పాటుకు కృషి చేయండి



మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం ఇస్తున్న శంకరనారాయణ

పుట్టపర్తి, ఆగస్టు 22 : రాష్ట్రంలో హరిత పాఠశాలలుగా మార్చడానికి కృషి చేయాలని మంత్రి లోకేశ్‌ను కోరినట్లు గ్రీన్ భారత్ ఫౌండేషన్ చైర్మన్ శంకరనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆయన సామకోటి ఆదినారాయణతో కలసి అమరావతిలో మంత్రిని కలిశానని వివరించారు. తాము పాఠశాలలను హరిత పాఠశాలలుగా మార్చడానికి తయారు చేసిన ప్రణాళికలను మంత్రికి వివరించామన్నారు. విద్యార్థి దశలోనే పర్యావరణం.. పచ్చదనంపై విద్యార్థులకు అవగాహన కలిగించి మొక్కలు పెంచేవిధంగా పాఠశాలలో కార్యక్రమాలను చేపట్టేందుకు సహకారం అందించాలని మంత్రిని కోరామన్నారు.

గల్లంతైన వృద్ధుడి మృతి



సూర్యనారాయణరెడ్డి (ఫైల్)

నల్లచెరువు, ఆగస్టు 22 : మండలంలోని గొర్రవాండ్లపల్లికి చెందిన సూర్యనారాయణరెడ్డి (60) రెండు నెలల క్రితం అదృశ్యమయ్యాడు. గురువారం నల్లచెరువు పాత రైల్వేస్టేషన్ సమీపంలో అతని మృతదేహం లభ్యమైనట్లు నల్లచెరువు ఎస్ఐ కెఎం. లింగన్న తెలిపారు. సూర్యనారాయణరెడ్డి గతంలోనూ ఇలా ఇంటి నుంచి వెళ్లిపోయి.. నాలుగైదు రోజులకు తిరిగి వచ్చేవాడని, అయితే రెండు నెలల క్రితం వెళ్లిన అతను తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. దీంతో అతని కుమారుడు రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడని చెప్పారు. పాత రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు తమకు సమాచారం ఇచ్చారని, మృతదేహానికి ఉన్న దుస్తులను బట్టి అతన్ని సూర్యనారాయణరెడ్డిగా కుటుంబ సభ్యులు గుర్తించారని చెప్పారు. సూర్యనారాయణరెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చానల్ విలేకరి అరెస్టు

రూ.30 లక్షల విలువైన 48 బాండ్లు, 16 ఖాళీ చెక్కులు స్వాధీనం

కదిరి, ఆగస్టు 22: అధిక వడ్డీలు వసూలు చేస్తున్న ఓ చానల్ విలేకరి ఉబేద్ సుల్తాన్ అలియాజ్ లాలీను స్థానిక షాలీమాల్ ఫంక్షన్ హాల్ వద్ద గురువారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ డీవీ నారాయణరెడ్డి తెలిపారు. అతన్ని కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. నెలకు రూ.వందకు రూ.10 నుంచి 20 వరకు వడ్డీ వసూలు చే సేవాడని, వడ్డీలు కట్టని వారిని బెదిరించేవాడని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, అతన్ని అరెస్టు చేశామని అన్నారు. అతని వద్ద నుంచి 48 ఖాళీ ప్రామిసరీ నోట్లు, 16 వివిధ బ్యాంక్‌లకు చెందిన ఖాళీ చెక్కులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటి విలువ దాదాపు రూ.30 లక్షలు ఉంటుందన్నారు. అరెస్టు చేసిన సుల్తాన్‌ను అడిషనల్ జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

సర్కిల్ కార్యాలయంలో చోరీ.. అరెస్ట్

నల్లమాడ : నల్లమాడ సర్కిల్ కార్యాలయంలో కంప్యూటర్, ప్రింటర్ మంగళ వారం రాత్రి చోరీ అయ్యాయని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ గురువారం తెలిపారు. సర్కిల్ కార్యాలయంలోనే చోరీ చేయడంతో తాము సీరియస్‌గా తీసుకొని.. కేసు దర్యాప్తు చేపట్టామని, తిప్పయ్యగారిపల్లికి చెందిన ఇద్దరు యువకులను అదుపుకొని తీసుకొని విచారించామని అన్నారు. కంప్యూటర్, ప్రింటర్‌ను తామే ఎత్తుకెళ్లామని ఆ నిందితులు ఒప్పుకున్నారని, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

జూదరుల అరెస్టు

ధర్మవరం, ఆగస్టు 22 : పట్టణంలోని మారుతీనగర్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారని, వారి నుంచి రూ.42,500 స్వాధీనం చేసుకున్నామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆ ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

ఎస్పీని కలిసిన సీఐ



పుట్టపర్తిరూరల్, ఆగస్టు 22: పుట్టపర్తి రూరల్ సీఐగా సురేష్ బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాదపూర్వకంగా గురువారం ఎస్పీ రత్నని కలిశారు. పుష్పగుచ్ఛం అందచేశారు.


బీసీల ఆత్మీయ సమావేశం

ధర్మవరం, ఆగస్టు 22 : స్థానిక ఎన్జీఓ హోంలో బీసీల ఆత్మీయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా కదిరిగేటు వద్ద నుంచి గాంధీనగర్, ఎన్టీఆర్, కళాజ్యోతి, కాలేజ్ సర్కిల్ మీదుగా ఎన్జీఓహోం కార్యాలయం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు మాట్లాడుతూ.. సమస్యలను కలిసికట్టుగా పోరాడి పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

బాధ్యతలు స్వీకరించిన
కొత్తచెరువు సీఐ ఇందిర



సీఐ ఇందిర

కొత్తచెరువు, ఆగస్టు 22 : కొత్తచెరువు సర్కిల్ నూతన సీఐగా ఇందిర గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ రాజారమేశ్ చిత్తూరు జిల్లా మొలకలచెరువుకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురం వీఆర్ నుంచి ఇందిరా బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఘనంగా చిరంజీవి జన్మదినం

కదిరి అర్బన్, ఆగస్టు 22 : మాజీ కేంద్ర మంత్రి, మెగాస్టార్ చిరంజీవ జన్మదిన వేడుకలను గురువారం జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చలపతి, రవికుమార్, రవీంద్ర, కిన్నెర మహేష్, సోముశేఖర్, లోకేష్, రామమోహన్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు



బత్తలపల్లిలో కార్మికుల నిరసన



లక్ష్మీచెన్నకేశవపురం పంపు హౌస్ వద్ద నినాదాలు

సత్యసాయి తాగునీటి కార్మికుల సమ్మె

ధర్మవరం,ఆగస్టు 22 : తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సత్యసాయి తాగునీటి కార్మికులు గురువారం నుంచి సమ్మె చేపట్టారు. ఈ మేరకు పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్దగల సత్యసాయి పంపు హౌస్ వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. ఆరు నెలలుగా జీతాలు అందలేదని, 11 నెలలు పీఎఫ్ అందించలేదని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించలేదని, చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని వాపోయారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని సత్యసాయి పంపు హౌస్ వద్ద సత్యసాయి తాగునీటి కార్మికు లు మోటర్లు ఆఫ్ చేసి సమ్మెలోకి వెళ్లారు. అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలన్నారు.

బత్తలపల్లి : సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు గురువారం నుంచి సమ్మెలోకి వెళ్లినట్లు ఆ సంఘం నాయకులు జగన్ తెలిపారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు.



ముదిగుబ్బలో...

అభివృద్ధిని అడ్డుకుంటే సహించం: టీడీపీ



ఇన్‌చార్జి ఎంపీడీఓతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ధర్మవరం రూరల్, ఆగస్టు 22 : కొంతమంది వ్యక్తులు సత్యకుమార్ మనుషుల మంటూ అధికారులకు ఫోన్లు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులకు అడ్డుకుంటున్నారని, అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని టీడీపీ నాయకులు మండిపడ్డారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో టీడీపీ మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, మాజీ కన్వీనర్ గొట్లూరు శ్రీనివాసులు మాట్లాడారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాలతోనే గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్స్, స్టోర్ డీలర్స్, యానిమేటర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు నియమించారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడ్డారని, కూటమి గెలుపు కోసపం నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు పనిచేశారని గుర్తుచేశారు. గెలిచిన తర్వాత కొంతమంది వ్యక్తులు వచ్చి తాము సత్యకుమార్ మనుషులమని అధికారులకు ఫోన్లు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ అబ్దుల్‌నబీ దృష్టికి తీసుకెళ్లారు. ఎవరూ ఫోన్‌చేసినా పట్టించుకోవద్దని, గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీఓను కోరామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంగం నరసింహులు, ముచ్చురామిక్రిష్ట, తలారి నారాయణస్వామి, టీఎన్‌టీయూసీ ఈశ్వరయ్య, అమరేంద్ర, చిరంజీవి పాల్గొన్నారు.

సీఐకి పలువురి శుభాకాంక్షలు

ధర్మవరం రూరల్, ఆగస్టు 22: ధర్మవరం రూరల్ సీఐ ఎన్. ప్రభాకర్‌ను గురువారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల బదిలీలో భాగంగా అనంతపురం ఏసీబీ నుంచి ధర్మవరం రూరల్ సీఐగా ఎన్ ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన విషయం తెల్సిందే. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయానికి వెళ్లిన టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి చింతలపల్లి మహేష్‌చౌదరి, మాజీ కన్వీనర్ గొట్లూరు శ్రీనివాసులు, విజయసారథి, చిగిచెర్ల రాఘవరెడ్డి, చిన్నూరు విజయ్‌చౌదరి, జంగం నరసింహులు, ముచ్చు రామిక్రిష్ట సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.



సీఐకి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు





ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్‌సభ్యులు, పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులు

దోషులను కఠినంగా శిక్షించాలి

ధర్మవరం, ఆగస్టు 22 : కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌ను హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్, మానవహక్కుల సంరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అలాగే పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులూ ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

కొత్తచెరువు, ఆగస్టు 22 : మండలంలోని తలమర్ల జిల్లాపరిషత్ పాఠశాలలోని 10 మంది పేద విద్యార్థులకు బయోజెమ్ ప్రగతి స్కాలర్‌షిప్‌లను ఆ కంపెనీ ప్రతినిధులు గురువారం అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.25 వేలు చొప్పున పంపిణీ చేశామని ఆర్ఎస్ఎం వరప్రసాద్ తెలి పారు. ఏటా పది మంది పేద విద్యార్థుల చదువుల కోసం ఈ కంపెనీ డబ్బులను అందజేస్తోం దన్నారు. ఈ కార్యక్ర మంలో ఏరియాసేల్స్ మేనేజర్ సుబ్బారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ సదాశివారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న సభ్యులు

ముగిసిన ఆరాధనోత్సవాలు



ధర్మవరం, ఆగస్టు 22 : పట్టణంలోని ఎస్‌బీఐ, గాంధీనగర్ వద్ద ఉన్న మారుతీ రాఘవేంద్రస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆరాధనోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు రోజున స్వామివారి మూలవిరాట్‌కు వివిధ రకాల పూలతో, తులసీ ఆకులతో అలంకరించి పూజలు చేశా రు. పంచామృతాభిషేకం, కనక మహాపూజ, రథోత్సవం తదితర పూజా కార్యక్రమాలు అర్చకులు నిర్వహిం చారు. సాయంత్రం నృత్యప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, పోలా ప్రభాకర్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ



జాన్వీ

కదిరి అర్బన్, ఆగస్టు 22: స్థానిక ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నాలుగు రోజుల క్రితం నిర్వహించిన హ్యాండ్‌బాల్ అంతర్ జిల్లాల పోటీల్లో అదే కళాశాల విద్యార్థిని జాన్వీ మొదటి స్థానం సాధించారు. ఆ విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్మిత, పీడీ నరసింహచారి, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

'వాల్మీకి' మండలాధ్యక్షురాలిగా నాగవేణి



నాగవేణి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 22: మండల వాల్మీకి సంఘం మహిళ విభాగం మండలాధ్యక్షురాలిగా మిట్టపల్లికి చెందిన బోగి నాగవేణిను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ మేరకు తనకు ఆ సంఘం రాష్ట్ర కోర్ కమిటీ ఉపాధ్యక్షుడు కుర్లపల్లి మోహన్ ఉత్తర్వులను పంపినట్లు నాగవేణి గురువారం తెలిపారు.

ఫ్రీ హోల్డ్ భూముల రికార్డుల పరిశీలన

బత్తలపల్లి, ఆగస్టు 22: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సీసీఎల్ఏ రాష్ట్ర అడిషనల్ కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి గురువారం రాత్రి తనిఖీ చేశారు. ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, ధర్మవరం తహసీల్దార్ నటరాజు, ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ రామారావు, వీఆర్‌ఓలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వైసీపీ నాయకుడు

కదిరి అర్బన్ : పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు మల్లిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి బీజేపీలో చేరారు. గురువారం విజయవాడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీ సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ కదిరి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన.. ఎన్నికల సమయంలో వైసీపీలో చేరారు. వైసీపీ విధానాలు నచ్చక తిరిగి బీజేపీలో చేరినట్లు ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు.



వేణుగోపాల్‌రెడ్డికి బీజేపీ కండువా కప్పుతున్న పురందేశ్వరీ

కర్ణాటక మద్యం స్వాధీనం

ధర్మవరం : పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. అతని నుంచి 43 టెట్రా ప్యా కెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఆర్డీ సొమ్ము స్వాహాపై విచారణ

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 22 : మండలంలోని కొండకమర్ల పోస్టాఫీసులో వీరప్పగారిపల్లికి చెందిన వి. చిన్నమ్మ ఆర్డీ సొమ్ము రూ. 14 వేలు గల్లంతైంది. దీనిపై ఆంధ్రజ్యోతి గురువారం ఓ కథనాన్ని ప్రచురించడంతో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌నాయక్ విచారణ చేపట్టారు. బాధితురాలిని పోస్టాఫీసుకు పిలిపించి విచారించారు. పోస్టాఫీసులో ఉన్న ఖాతాల మొత్తం తనిఖీ చేస్తామని, ఖాతాదారులు కూడా పాస్ పుస్తకాలు సిబ్బందికి ఇవ్వరాదని చెప్పారు. డబ్బులు ఖాతాలో జమ చేసిన వెంటనే ఫోన్‌నెంబర్ లింక్ ఉంటే మెసేజ్ వస్తుందని, మేసేజ్ రాకపోతే ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మెయిల్ ఓవర్‌సీర్ దుర్గా, పోస్టుమాస్టార్ ఈశ్వరయ్య ఉన్నారు.

పాస్టర్స్ కమిటీ ఎంపిక

ధర్మవరం, ఆగస్టు 22: ధర్మవరం యునైటెడ్ పాస్టర్స్ వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పాస్టర్స్ పట్టణ కమిటీని గురువారం ఎంపిక చేశారు. స్థానిక మార్కెట్ వీధిలోని ఎస్ఐయూ చర్చిలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎంపికను చేపట్టారు. కమిటీ ప్రెసిడెంట్‌గా షెక్ మోజెస్, వైస్ ప్రెసిడెంట్‌గా విజకుమార్, సెక్రటరీగా సుధాకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా సాలోమోన్, కోశాధికారిగా గ్రేనయ్య ఎన్నుకున్నారు. ఇందులో తమిళనాడులోని ఏలూరుకు చెందిన దైవసహాయం, సీనియర్ దైవసేవకులు సుందర్‌సింగ్, సుకుమార్ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోండి

నంబులపూలకుంట, ఆగస్టు 22: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను వచ్చే నెల 15లోపు నమోదు చేసుకోవాలని ఏఓ లోకేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని వ్యవసాయ సహాయకులు ధనియాన్‌చెరువు, మేకలచెరువు, ఎదురుదొన, వెలిచెలమల, ఎన్పీకుంటల్లో చేపడుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

25న కవి సమ్మేళనం

కదిరి అర్బన్, ఆగస్టు 22: కదిరిలో వేమన సాహితీయాత్రలో భాగంగా ఈనెల 25న కవిసమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శంకర్‌నారాయణరాజు, చిన్నారావు, బాబాఫక్రుద్దీన్ గురువారం ఓప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యం, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత టీకే. చదువులబాబు ముఖ్య అతిథులుగా హాజరవు తున్నారన్నారు. ఈ సమ్మేళనానికి రాష్ట్ర వ్యాప్తంగా 60మంది కవులు హాజరవుతారని, భాషాభిమానులు, సాహితీ వేతలు, కవులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అవగాహన సదస్సు

ధర్మవరం, ఆగస్టు 22: స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ యువ జన దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్, నెహ్రూ యువ కేంద్రం సంస్థ డైరెక్టర్ భరత్, ఇన్‌చార్జి శ్రీనివా సులు, ప్రభుత్వాస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ అరవింద్, మైత్రి సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ రాధమ్మ, ప్రాజెక్టు మేనేజర్ నవీన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గోపాల్‌నాయక్, అధ్యాపకులు చిట్టెమ్మ, షమీవుల్లా, భువనేశ్వరి, పుష్పావతి, సరస్వతి పాల్గొన్నారు.

రేపు ద్విచక్రవాహన వేలం

కొత్తచెరువు : పుట్టపర్తి సెబ్ కార్యాల యంలో ఒక ద్విచక్ర వాహనాన్ని శనివారం ఉదయం 11 గంటలకు వేలం వేస్తున్నట్లు సెబ్ ఎస్ఐ రమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.1000 డిపాజిట్ చేసి పాల్గొనాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: మండలంలోని తుంపర్తి కాలనీకి చెందిన వెంకటరంగారెడ్డి పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతను స్థానిక కేతిరెడ్డి కాలనీలో ఓ స్థలం విషయంలో అగ్రిమెంట్ విషయంలో మోసపోయాడు. దీంతో మనస్థాపానికి గురైన అతను ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులకు అపస్మారకస్థితిలో ఉన్న అతన్ని వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్, ఆగస్టు 22: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గణితంలో గెస్ట్ అధ్యాపకులుగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హరేంద్రప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ గణితంగా కనీసం 50 శాతం మార్కులు కలిగిన ఉన్న అభ్యర్థులు ఈనెల 27లోపు కళాశాలలో దరఖాస్తు అందచేయాలన్నారు. అభ్యర్థులకు 28న ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి పశువైద్య శాలలో గురువారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించినట్లు పశువైద్యుడు రవినాయక్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ టీవీ సుధాకర్,పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నల్లచెరువు, ఆగస్టు 22: మండలంలోని పంతులచెరువు పంచాయతీలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం పర్యటిస్తారని ఎంపీడీఓ శకుంతల గురువారం తెలిపారు. ఇందుకూరివాండ్లపల్లిలో మొక్కల నాటే కార్యక్రమం, గ్రామసభల్లో పాల్గొంటారన్నారు.

శాంతి భద్రతలపై దృష్టి పెట్టండి: ఎంపీ


ఎంపీ పార్థసారథికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ

పెనుకొండ, ఆగస్టు 22 : డివిజన్‌లో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టిసారించి ప్రశాంత వాతావరణం నెలకొనేలా విధులు నిర్వహించాలని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి డీఎస్పీ శ్రీనివాసులుకు సూచించారు. గురువారం సాయంత్రం పెనుకొండ ఎంపీ కార్యాలయంలో ఎంపీని డీఎస్పీ శ్రీనివాసులు, సోమందేపల్లి ఎస్‌ఐ రమేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు పెనుకొండ డివిజన్‌లో శాంతిభద్రతలపై చర్చించారు.

ముగిసిన రాఘవేంద్ర స్వామి ఆరాధన



పెనుకొండ, ఆగస్టు 22 : స్థానిక రాఘవేంద్రస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న స్వామివారి 353వ ఆరాధనోత్సవాలు గురువారం ఉత్తరారాధనతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు అర్చకులు సునీల్ ఆధ్వర్యంలో ఉదయం నిర్మాల్య విసర్జన, పంచామృతాభిషేకం, అష్టోత్తర పారాయణం, పురవీధుల్లో స్వామివారి పల్లకి ఊరేగింపు, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. అన్నసంతర్పణ నిర్వహించారు.

అలంకరణలో బృందావనం

ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన


ఎకో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 22 : పట్టణంలోని మెయిన్ బజార్ రోడ్డులో ఉన్న శ్రీసాయి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత గుండె శిబిరానికి విశేష స్పందన లభించింది. సోమందేపల్లి, చుట్టుపక్కల గ్రామస్థులు పెద్దఎత్తున తరలి వచ్చారు. శిబిరంలో షుగర్, బీపీ పరీక్షలతోపాటు ఉచితంగా 2డీఎకో లాంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యురాలు మహేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ సవేరా వైద్యులు సందీప్, ఎగ్జిక్యూటివ్ లక్ష్మీనారాయణ, టెక్నీషియన్ నిత్య, కోఆర్డినేటర్ సంధ్య, నర్సులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

మండల కేంద్రంలోని రాజ్యలక్ష్మీ మెడికల్స్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పెద్దమ్మ దేవాలయం సమీపంలో చేపట్టిన శిబిరంలో కంటి సమస్య ఉన్న వారికి కంప్యూటర్ పరీక్షలు నిర్వహించి అద్దాలు, మందులు పంపిణీ చేశారు.

ఆస్తి కోసం అన్నదమ్ముల ఘర్షణ



గాయపడ్డ ఇరువర్గాల కుటుంబ సభ్యులు

హిందూపురం(పరిగి), ఆగస్టు 22 : ఆస్తి కోసం అన్నదమ్ములు కర్రలు, రాళ్లతో దాడిచేసుకున్న సంఘటన మండలంలోని నేతులపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాల మేరకు ఆస్తిని భాగాలు చేయాలని బాలకృష్ణ, శివప్ప అన్నదమ్ములు, వీరిద్దరూ ఆస్తిని బాగాలుగా చేయాలని ఐదు రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. పంచాయితీకి దిగిన వీరు పెద్దమనుషుల సమక్షంలో ఇరువర్గాల వారు రాజీపడ్డారు. బుధవారం రాత్రి అదే ఆస్తి తగాదాలతో బాలకృష్ణ శివప్పపై గొడవకు దిగాడు. ఇరువర్గాల కుటుంబ సభ్యులు రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులకు దిగారు. గొడవ పోలీస్ స్టేషన్‌కు చేరడంతో 448, 427, 501, 324 సెక్షన్‌ల కింద కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ..!

పెనుకొండ, ఆగస్టు 22 : పెనుకొండ నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా ఈయన్ను కళ్యాణదుర్గం మున్సిపాలిటీకి బదిలీ చేసినట్లు సమాచారం.


రైతు సంక్షేమమే కియ ధ్యేయం

● అభివృద్ధి పనులకు కంపెనీ ప్రతినిధుల భూమిపూజ


భూమిపూజ చేస్తున్న కియ ప్రతినిధులు, అంగన్ వాడీ సిబ్బంది

పెనుకొండ రూరల్, ఆగస్టు 22 : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతు సంక్షేమమే కియా ఇండియా ధ్యేయమని కంపెనీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్‌డాంగ్లి పేర్కొన్నారు. సీఎస్ఆర్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కార్యక్రమంలో భాగంగా మునిమడుగు, దుద్దేబండ, బొజ్జిరెడ్డిపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలో అంగన్ వాడీ కేంద్రాలు, పండ్ల తోటల పెంపకానికి సమకరిస్తామన్నారు. పెనుకొండ, చెన్నేకొత్తపల్లి మండలాల్లో 20గ్రామాల్లో దాదాపు 600మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కియా పీఆర్‌ఓ శమ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతలక్ష్మీ, సర్పంచ్ అశ్వర్థనారాయణ, చిన్నవెంకటరాముడు, రమేష్, శ్రీనివాసులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురై రైతుకు అస్వస్థత


ఆస్పత్రిలో రైతు

పెనుకొండ రూరల్, ఆగస్టు 22 : మండలంలోని హనుమప్పల్లిలో ముత్యాలప్ప అనే రైతు పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు హనుమప్పల్లి గ్రామానికి చెందిన ముత్యాలప్ప తనవ్యవసాయ పొలంలో మామిడిచెట్లు సాగుచేశారు. పొలాల్లో డ్రిప్ స్ప్రింక్లర్ల పైపులు మార్చుతుండగా పాము ముత్యాలప్ప చేతికి కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి అనంతపురానికి తరలించారు.

ఎస్‌ఐను సన్మానించిన టీడీపీ నాయకులు

హిందూపురం(పరిగి), ఆగస్టు 22 : పరిగిఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన రంగడు యాదవ్‌ను టీడీపీ నాయకులు బొకేలతో సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ కన్వీనర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ ఎస్‌ఐ రంగడు విధినిర్వహణలో ముక్కుసూటిగా సమర్థవంతంగా సేవలందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, సూర్యనారాయణ, ఈశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, డీఎస్ఎల్ శ్రీనివాసులు, ఆదిమూర్తి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలకు అడ్డుకట్టపడేనా..?

● కొత్త అధికారులకు పాత సవాళ్లు ● పురం పోలీస్ శాఖలో కీలక మార్పులు



హిందూపురం, ఆగస్టు 22 : పురం పోలీస్ శాఖలో కీలక మార్పులు, ఉన్నతాధికారులు పలువురు కొత్తగా బాధ్యతలు చేపట్టడంతో శాంతిభద్రతల పరిరక్షణపైనే జోరుగా చర్చలు మొదలయ్యాయి. ఐదేళ్ల వైసీపీ కాలంలో పోలీసులు సొంత విధులు పక్కనబెట్టి వైసీపీ నాయకులకు అండగా నిలవడం ఎవరైనా ప్రశ్నిస్తే, ఎదురుతిరిగితే పోలీసులు అరెస్ట్ చేసేవారు. శాంతి భద్రతల విషయంలో ఎన్నడూ స్పందించిన దాఖలాలు లేవని ప్రజలే చెప్పుకుంటున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోలీస్ అధికారులు మొత్తం బదిలీ అయ్యారు. ఎస్‌ఐ నుంచి ఎస్పీ వరకు కొత్తవారు రావడంతో ఇకనైనా హిందూపురంలో శాంతిభద్రతల విషయంలో రాజీపడకుండా పనిచేస్తారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆదిశగా కొత్త అధికారులు ప్రయత్నాలు చేస్తారా లేక పాత అధికారుల మాదిరే రోజులు గడిపేసి వెళ్తారా ముున్ముందు చూడాల్సిందే.

కొత్త అధికారులకు పాత సవాళ్లే

ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం అయ్యిందని చెప్పవచ్చు. ఎన్నడూలేనివిధంగా గంజాయి, చిల్లర దుకాణాల్లో సైతం విక్రయాలు జరిపే స్థితికి వచ్చింది. దీంతోపాటు పేకాట, మట్కా, కర్ణాటక మద్యం విచ్చలవిడిగా సాగుతోంది. గంజాయి సేవించిన యువకులే హత్యకేసులో ఉండటంతో అందరూ నివ్వెరపోయారు. దీనికితోడు పట్టణంతోపాటు పల్లెల్లో వరుస చోరీలు జరుగుతున్నాయి. అదికూడా రోజుకోవిధంగా దొంగలు పురంపై పడుతున్నారు. ఓవైపు తాళం వేసిన ఇళ్లను దోచేస్తుండగా మరికొన్ని సందర్భాల్లో బ్యాంకుల నుంచి నగదును తీసుకొస్తే తస్కరించే ప్రమాదంనెలకొంది. దారిలో పోయేవారిని అడ్డగించి దాడిచేసి నగలు, నగదు దోచుకుంటున్నారు. ఇటీవల ద్విచక్రవాహనాలు దొంగలించడం పరిపాటైంది.

ట్రాఫిక్‌తో తీవ్ర అవస్థలు

పట్టణంలో రోజు రోజుకు వాహనాల సంఖ్య పెరుగుతోంది. పట్టణంలో రద్దీ అధికమైంది. కానీ దశాబ్దాల క్రితం నిర్మించిన రహదారే ఉండటంతో పట్టణంలోకి రావాలంటే ట్రాఫిక్‌తో జంకే పరిస్థితి నెలకొంది. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు నియంత్రణపై చేతులెత్తేశారు. ఎక్కడబడితే అక్కడ వాహనాలు అడ్డుగా పెట్టడం, ట్రాఫిక్ జామ్ అవ్వడం నిత్యకృత్యమైంది. దీంతో ట్రాఫిక్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చీకటి పడితే జంకుతున్న జనం

పట్టణంలో చీకటి పడితే చాలు రోడ్డెక్కడానికి జనం జంకుతున్నారు. ఇటీవల చైన్‌స్నాచింగ్‌లు జరుగుతుండటంతో మహిళ లు భయపడే పరిస్థితి నెలకొంది. పాఠ శాలలు, కళాశాలలకు వెళ్లొచ్చే సమయంలో పోకిరీలు కవ్వింపు చర్యలకు పాల్పడు తున్నారు. కళాశాల, పాఠశాలవద్ద పోలీసు లు గస్తీ తిరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలీస్ ఉనికి చాటేరా?

నిన్నటి వరకు పనిచేసి వెళ్లిన కొంతమంది పోలీస్ అధికారులు వైసీపీ మరక అంటించుకున్నారు. దీనివల్ల ప్రజా సమస్యలకంటే వైసీపీ నాయకుల సమస్యలే అజెండాగా పనిచేశారు. కానీ కూటమి ప్రభుత్వం రావడంతో ఇకనైనా పోలీస్ ఉనికి చాటేరా అని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త పోలీస్ అధికారులు ఖాకీ పరువు నిలబెడతారని, నేరాలకు అడ్డుకట్ట వేస్తారని ఆశిద్దాం.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం : డీఎస్పీ


జిల్లా ఎస్పీతో డీఎస్పీ మహేష్

హిందూపురం పురం సబ్‌డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని గురువారం బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ మహేష్ పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా గంజాయి, మట్కా, పేకాటపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన డీఎస్పీకి సీఐలు అభినందించారు.

హరిత పాఠశాలలుగా మార్చాలని మంత్రి లోకేశ్‌కు వినతి


మంత్రి నారా లోకేశ్‌కు ప్రణాళిక గురించి వివరిస్తున్న శంకర్‌నారాయణ

గోరంట్ల, ఆగస్టు 22: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బడులను హరిత పాఠశాలలుగా రూపు దిద్దాలని జాతీయ పర్యావరణ అవార్డు గ్రహీత శంకర్‌నారాయణ విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేసినట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతిలో మంత్రి నారాలోకేశ్‌ను టీడీపీ జిల్లా నాయకులు సామకోటి ఆదినారాయణతో కలిసి ప్రణాళికలను అందచేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా ఆక్సిజన్ ఉత్పత్తి కోసం బృహత్తర ప్రణాళిక చేపట్టాలని మంత్రిని కోరామన్నారు. వర్షాకాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రతి పాఠశాలలోనూ సీడ్‌బాల్స్ తయారు చేసి, విద్యార్థులచే పాఠశాల ఆవరణంలో విత్తనాలు పూడ్చేలా చేయాలన్నారు. కొండలు, బీడు ప్రాంతాల్లోనూ వ్యాప్తి చెందేలా చూడాలని విద్యార్థులతోనే రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా మార్చగల సత్తా ఉపాధ్యాయులతోనే సాధ్యపడుతుందని వివరించామన్నారు. వీటితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హరితాంధ్రప్రదేశ్‌గా మర్చాలన్న కన్న కలలకు సకారం చేకూరతుందన్నారు. తమ ప్రణాళికపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

సీఎం చంద్రబాబుతో గుండుమల భేటీ


చంద్రబాబును కలిసిన గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఆగస్టు 22 : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును గురువారం సచివాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు గుండుమల నియోజకవర్గంలో పర్యటించారు. ఆసందర్భంగా పలు హామీలను ఇచ్చారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నియోజకవర్గ అభివృద్ధి, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

వసతి గృహాల్లో నిబంధనలు పాటించాలి

హిందూపురం అర్బన్, ఆగస్టు 22: బాలల రక్షణ వసతి గృహాల్లో నిబంధనలు పాటించాలని డీపీఓ ఖలీల్‌భాష, సీడీపీఓ రెడ్డిరమణమ్మ పేర్కొన్నారు. గురువారం పట్టణ పరిధిలోని రహమత్‌పురం సత్యసాయి బాలసదన్, ప్రభుత్వ బాలికల వసతి గృహాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లిలో ఓ హోంలో ఆహారం తిని పిల్లలు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందేనన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రక్షణ గృహాల్లో పారిశుద్ధ్యం, ఆహార భద్రత, నీటి వసతి, రికార్డులు తదితర విషయాలు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. డీసీపీఓ మహేష్, ఓపిఐసీ నాగలక్ష్మీ, ఎన్ఐసి మురళి, ఎల్‌సీపీఓ మల్లేష్‌రెడ్డి చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారులు తదితరులు ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఏడీసీసీ ఉద్యోగుల నిరసన


బ్యాంక్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గోరంట్ల, ఆగస్టు 22: పట్టణంలోని ఏడీసీసీ బ్యాంక్‌ఉద్యోగులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా నాబార్డు సహకారంతో రాష్ట్రంలో పీఏసీఎస్‌లో కంప్యూటరీకరణ ప్రక్రియలను ప్రవేశపెట్టారన్నారు. కంప్యూటరీకరణతో ఎదురవుతున్న సమస్యలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపట్టామన్నారు. 24న విజయవాడలోని ధర్నా నిర్వహిస్తారన్నారు. నిరసన కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఎస్ఎల్ఎన్ గుప్త, అసిస్టెంట్ మేనేజర్ హరికృష్ణ, బ్రాంచ్ పరిధిలోని వివిధ సంఘాల సీఈఓలు, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

గోరంట్ల, ఆగస్టు 22: పట్టణంలోని ఎస్‌పీఎస్ ఎయిడెండ్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ యవ్వన దశలో విద్యార్థులు మాదకద్రావ్యలు, గంజాయి లాంటి మత్తు పదార్థాలు అలవాటు చేసుకుంటే భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. అనంతరం 423 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. ఈకార్యక్రమంలోడాక్టర్ శ్రుతి, సీహెచ్‌ఓ గాయత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ అడవాల సూర్యనారాయణ, ఏఎన్ఎం అనిత, మహిళ పోలీస్ హేమావతి, ఆశకార్యకర్తలు శబరీ, వరలక్ష్మీ, సువర్ణ, శాంతమ్మ, నాగమణి, సుజాత, ఎన్ఎస్ఎస్ పీఓలు బాబు, కళావతి, రామక్రిష్ణ, రామాంజనేయులు, విద్యార్థులున్నారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

లేపాక్షి, ఆగస్టు 22: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేను బీఎల్‌ఓలు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ పేర్కొన్నారు. గురువారం మైదుగోళంలో నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఎల్‌ఓ యాప్, సర్వే విధానం పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏవైనా సమస్యలుంటే ఫోన్‌ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు చేయరాదన్నారు.

స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి: బీఎస్పీ


ధర్నాలో బీఎస్పీ నాయకులు

పావగడ, ఆగస్టు 22 : ఆసియా ఖండంలోనే అతిపెద్ద సోలార్ పార్క్‌గా పేరుగాంచిన పావగడలోని తిరుమణి ప్రాంతంలో నెలకొన్న వివిధ సోలార్ పార్కుల్లో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు సోలార్‌పార్క్ నిర్మాణంతో పనులు లేకుండా పోయాయని, సీఎస్ఆర్ నిధులతో నెలసరి పింఛన్ అందేలా చూడాలని జిల్లా బీఎస్పీ కార్యదర్శి హనుమంత్రాయ డిమాండ్ చేశారు. సోలార్‌పార్క్ యాజమాన్యంతో చర్చించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పాడి పశువులకు టీకా వేయాలని రైతుల డిమాండ్


లేపాక్షి పశువైద్యశాల

లేపాక్షి, ఆగస్టు 22 : పాడి పశువులకు టీకా కార్యక్రమం ప్రారంభించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి చేదోడుగా పశువులకు అందాల్సి వైద్యం పడకేసింది. గత వైసీపీ ప్రభుత్వం పశువ్యాధి టీకాలపై, పశుసంరక్షణపై నిర్లక్ష్యం వహించడంతో చాలా మంది పాడి రైతులు ఆర్థికంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పశుపోషణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. సకాలంలో సీజనల్ వారీగా వ్యాధినిరోధక టీకాలు వేయాలని పశువైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈనెల 20నుంచి సెప్టెంబర్ 18వరకు ప్రతి గ్రామంలోనూ పశువైద్య శిబిరాలు ఏర్పాటుచేసి పశుపోషణపై అవగాహన, వ్యాధినిరోధక టీకాలు అధికారులు టీకా కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లు విడుదలైనా, వ్యాధినిరోధక టీకాలు ఆసుపత్రికి చేరుకున్నా సిబ్బంది కార్యక్రమాన్ని ప్రారంభించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే వ్యాధినిరోధక టీకాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అతిసార మరణాలు

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆగ్రహం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్/గుడిబండ/రొళ, ఆగస్టు 22 : వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే అతిసార వ్యాధితో ప్రజలు మృత్యువాత పడ్డారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ధ్వజమెత్తారు. గురువారం మండలంలోని కొంకల్లు, ఎస్.రాయపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో పంచాయతీ నిధులను పక్కదారి పట్టించారని, ప్రజారోగ్యంపై దృష్టి పెట్టిన పాపాన పోలేదన్నారు. రెండు గ్రామాల్లో అధికారులను అప్రమత్తం చేసి 24గంటలు గ్రామాల్లో ప్రజలకు వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి చికిత్స అందించడంతోనే వ్యాధి తగ్గుముఖం పట్టిందన్నారు. గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే టీడీపీ ధ్యేయమన్నారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీరు కలుషితం కాకుండా ఈగలు, దోమలు వ్యాప్తిచెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లి గ్రామాలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఎంపీడీఓ రామారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరి, ఈఓఆర్డీ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు దుర్గేష్, కొంకల్లు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

అతిసారతో మృతిచెందిన తొమ్మిది మంది కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయాన్ని అందించారు. రూ.20వేల చొప్పున 9మంది కుటుంబాలకు మొత్తం రూ.1.80లక్షలు ఆర్థిక సాయం అందించారు.

అసత్య ఆరోపణలు తగవు

జగన్ పత్రిక అబద్ధాల పుట్ట అని తనపై రాసిన రాతలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సవాల్ ఎమ్మెల్యే సవాల్ విసిరారు. గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో జగన్ పత్రికలో తప్పుడు కథనాన్ని నిరసిస్తూ పత్రికను దహనం చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా మహిళలకు సంబంధించిన దాడుల్లో కేసు నమోదు కాకుండా టీడీపీ నాయకులు అడ్డుపడింటే నిరూపించాలన్నారు. అసత్య ఆరోపణలు తగవన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

పెనుకొండ రూరల్, ఆగస్టు 22 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ క్రింద పనులు గుర్తించడానికి పెనుకొండ, రొద్దం మండలాల్లోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఉదయం 11గంటల నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ జయమ్మ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25సంవత్సరానికి సంబంధించి ఆయా గ్రామాల్లో ఉపాధి పనులపై 11గంటల నుంచి 2గంటల వరకు సమావేశం నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయం, రచ్చకట్ట, గ్రామ సచివాలయం, స్కూల్ ముందు గ్రామసభలు ఉంటాయని ఉపాధి కూలీలు, రాజకీయ నాయకులుగ్రామసభలో చర్చించాలని కోరారు.

మడకశిర రూరల్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ క్రింద పనులు గుర్తించడానికి శుక్రవారం మండలంలోని అన్నీ పంచాయతీ కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోనియాబాయి, ఏపీఓ శ్రీకాంత్ గౌడ్ గురువారం ప్రకటించారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుమెంబర్లు, కూలీలు అందరూ హాజరు కావాలని సూచించారు.

మడకశిర(అమరాపురం) : అమరాపురం మండలంలోని 11 గ్రామ పంచాయతీలలో ఈనెల 23వతేదీన శుక్రవారం నిర్వహిస్తారని అమరాపురం మండల టీడీపీ అధ్యక్షుడు గణేష్ తెలిపారు. ఈకార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈగ్రామసభలో ప్రభుత్వం ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తుందని, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెడతారన్నారు.

హిందూపురం(సోమందేపల్లి) : ఉపాధి పనులపై శుక్రవారం నిర్వహించనున్న గ్రామసభలపై గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ సోమశేఖర్, ఇన్‌చార్జ్ ఈఓ ఆర్డీ శ్రీధర్, కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు యాక్షన్‌ప్లాన్‌పై అవగాహన కల్పించారు. అజెండా అంశాలైన ఉపాధిహామీ పథకం కింద వేతనాలు కోరే హక్కు, అర్హతలపై అవగాహన , ప్రస్తుతం పురోగతిలో ఉన్న పనులు, 2024-25సంవత్సరానికి సంబంధించి ఆర్థిక ప్రతిపాదనలు, సోషల్ ఆడిట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం వివిధ అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

29న మెగా జాబ్‌మేళా

పెనుకొండ, ఆగస్టు 22 : స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఈనెల 29న మెగాజాబ్ మేళా నిర్వహించనున్నారు. కొడికొండకు చెందిన సమర్థనం దివ్యాంగుల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వెంకటేశ్ గురువారం ప్రకటించారు. మేళాకు మ్యాన్‌పవర్ గ్రూప్స్ సర్వీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ కంపెనీ, ఇండియ ఎంఐఎం, మెడ్‌ప్లస్ తదితర 20 కంపెనీ ప్రతినిధులు హాజరవుతారన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలు గల అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 6364867798, 6364867797కు సంప్రదించాలన్నారు.

ఎస్ఓ బాధ్యతల స్వీకరణ

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 22 : సోమందేపల్లి కేజీబీవీ ఎస్‌ఓగా అనిత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జ్ ఎస్‌ఓగా ఉన్న శానీదేవి విద్యార్థులను వేధించడంతో మంత్రి ఆదేశాల మేరకు అప్పట్లో జిల్లా విద్యాశాఖాధికారులు ఈమెను విధుల నుంచి తప్పించారు. విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు తిరిగి బాధ్యతలు చేపట్టినట్లు ఎంఈఓ ఆంజనేయులు తెలిపారు.

నేడు హిందూ సంఘాల ర్యాలీ

హిందూపురం అర్బన్, ఆగస్టు 22: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి, కోలకత్తాలో వైద్యవిద్యార్థిని కిరాతకంగా చంపిన చర్యలను నిరసిస్తూ హిందూ సంఘాల ఐక్య వేదిక నిరసన ర్యాలీ చేపట్టనుంది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలో పెద్ద ఎత్తున కాగడాలతో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు వేదిక ప్రకటించింది. ర్యాలీకి కులమతాలకు అతీతంగా మహిళలు, యువతీ యువకులు, విద్యార్థులు, పుర ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని వారు కోరారు. ర్యాలీ చిన్నమార్కెట్ పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ఉంటుందన్నారు. హిందువులపై దాడులను ప్రశ్నించకపోతే భవిష్యత్తులో మరింత ప్రమాదం తప్పదని, ర్యాలీకి విరివిగా తరలి రావాలని వారు పిలుపునిచ్చారు.